


ముప్వెన్నెల విద్యుద్దీపాలతో ప్రకాశిస్తున్న గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం



చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్

జెండా పండుగకు సర్వంసిద్ధం

- జార్జ్‌కోటపై పతాకావిష్కరణచేయనున్న సీఎం
- మెరీనాలో ఐదంచెల భద్రత
- రాష్ట్ర వ్యాప్తంగా లక్షమంది పోలీసులతో పహారా



సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గురువారం స్వాతంత్ర్యదినోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థలు, విద్యాలయాలు జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షమందితో భద్రత ఏర్పాటు చేసినట్లు పోలీస్ శాఖ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున జార్జ్‌కోటలో, అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ఆయా సంస్థల కార్యాలయాల్లో కూడా జెండా పండుగ నిర్వహించనున్నారు. కాగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసులు సమస్యాత్మక ప్రాంతాలు, ఆలయాలు, చర్చిలు, మసీదులు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలు, భారీ వంతెనలు, డ్యామ్‌ల వద్ద పటిష్ఠమైన భద్రతా చేపట్టింది. ఎక్కడికక్కడ అనుమానితుల్ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు హింసాత్మక ఘటనలకు అవకాశం ఇవ్వకుండా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా పలువురిని అరెస్టు చేశారు. అంతేగాక ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు, డ్రోన్లతో డేగకన్ను నిఘా పెట్టారు.

భారత స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని సెయింట్ జార్జ్ కోట వద్ద సుమారు తొమ్మిదివేలమందితో ఐదంచెల పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సెయింట్ జార్జికోటపై జాతీయపతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకలకు గత పదిహేను రోజులుగా సీనియర్ పోలీసు ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. వారం రోజులుగా సచివాలయాన్ని సందర్శించేందుకు వచ్చేవారిపై పోలీసులు డేగకన్నుతో నిఘా వేశారు. మరోవైపు సెయింట్ జార్జికోట పరిసరాల్లో బాంబ్‌స్క్వాడ్ నిపుణులు, పోలీసు జాగిలాల సాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కామరాజర్‌సాలైలో వెళ్లే వాహనాలను క్రమబద్ధీకరించారు. గురువారం ఉదయం ఆ మార్గంలో వాహనాల రాకపోకలపై నిషేధం అమలు చేస్తున్నారు.

అవార్డుల ప్రదానం...

ముఖ్యమంత్రి స్టాలిన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ఈ యేడాది తగసాలై తమిళర్ అవార్డును కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణా మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తండ్రి కుమరిఅనంతన్‌కు ప్రదానం చేస్తారు. ఈ అవార్డు కింద ఆయనకు రూ.10లక్షల నగదు బహుమానంగా అందజేస్తారు. ఇదే రీతిలో అబ్దుల్‌కలాం అవార్డు, కల్పనాచావ్లా అవార్డు, సీఎం స్పెషల్ అవార్డు, దివ్యాంగులకు సేవలందించిన వ్యక్తులు లేదా సంస్థలకు అవార్డు, మహిళా సంక్షేమం కోసం పాటుపడిన సంస్థ, వ్యక్తులకు అవార్డు, అభివృద్ధిలో సత్తాచాటిన పంచాయతీలకు అవార్డు, యువజన అవార్డు తదితర అవార్డులను ఆయన అందజేస్తారు. గురువారం ఉదయం 8.45 గంటలకు సెయింట్‌జార్జి కోట వద్ద ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత కోట బురుజు వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. ఈ వేడుకలకు హాజరయ్యే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు, పోలీసు ఉన్నతాధికారులు, ఎంపీలు, శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రులు ఐఏఎస్ అధికారుల కోసం వేర్వేరుగా సెయింట్ జార్జ్‌కోటకి ఎదురుగా ప్రత్యేకగ్యాలరీలు నిర్మించారు.

15 మంది పోలీసులకు సీఎం పతకాలు..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో విశిష్టసేవలందించినందుకు ఈ యేడాది 15 మంది పోలీసులకు ముఖ్యమంత్రి సేవా పతకాలను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం ఓ ప్రకటన విడుదల చేసింది. వేలూరు జిల్లా సైబర్‌క్రైం స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ కె.పునిత, చెన్నై సెంట్రల్ విభాగం సైబర్ క్రైం విభాగం ఎస్‌ఐ డి.వినోద్‌కుమార్, కడలూరు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సౌమ్య, తిరుప్పూరు నగరం సైబర్‌క్రైం పోలీసుస్టేషన్ ఎస్‌ఐ ఐ.స్వర్ణవల్లి, కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోవిల్ క్రైం విభాగం ఎస్‌ఐ ఎన్. పార్వతి, తిరుప్పూరు సెంట్రల్ క్రైం ఎస్‌ఐ పి.రాధా ఈ అవార్డులను స్వీకరించనున్నారు. ఇదే విధంగా చెంగల్పట్టు జిల్లాకు చెందిన డీఎస్పీ ఎస్.పుగళేంది గణేశ్, ఈరోడ్ జిల్లాకు చెందిన ఎస్‌ఐ ఇరా దైవరాణి, వేలూరు జిల్లా పొన్నై ఎస్‌ఐ ఎ.అన్బరసి, తూత్తుకుడి జిల్లాకు చెందిన డీఎస్పీ ఎన్.సురేష్ పతకాలు అందుకుంటారు. ఇక ప్రజలకు సేవలందించటంలో నిస్వార్థంగా విధులు నిర్వహించిన చెన్నై క్రైం విభాగం ఉపాధ్యక్షుడు డీఎస్ అన్బు; చెన్నై సెంట్రల్ క్రైంవిభాగం ఎస్పీ ఇ.కార్తీక్, సేలం సర్కిల్‌కు చెందిన డీఎస్పీ సి.ఆర్. భూపతిరాజన్, చెన్నై పోలీసు సాంకేతిక విభాగం ఎస్‌ఐ కె.శ్రీనివాసన్, చెన్నై ప్రధాన కార్యాలయానికి చెందిన ఎస్‌ఐ ముబైదుల్లాహ్ పతకాలు స్వీకరించనున్నారు. ఎనిమిది గ్రాముల మేలిమి బంగారంతో రూపొందించిన ఈ పతకాలతో పాటు రూ.25 వేల నగదు పురస్కారాలను కూడా స్వీకరించనున్నారని ప్రభుత్వం ఆ ప్రకటనలో పేర్కొంది.

23 మంది పోలీసులకు రాష్ట్రపతి పతకాలు

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని అన్ని రాష్ట్రాల్లో విధినిర్వహణలో ప్రతిభాపాటవాలు ప్రదర్శించే, విశిష్టసేవలందించే ఐపీఎస్ అధికారులు, సీఐ, ఎస్‌ఐ, కానిస్టేబుళ్లకు పతకాలను ప్రకటిస్తుంది. రాష్ట్రపతి పేరుమీద ఈ పతకాలను ప్రకటిస్తారు. ఈ మేరకు బుధవారం ఉదయం రాష్ట్రపతి పతకాలు పొందేవారి జాబితాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ యేడాది రాష్ట్రానికి చెందిన 23 మంది పోలీసులు ఆ జాబితాలో ఉన్నారు. హోంగార్డ్ డీజీపీ వన్నియపెరుమాళ్, తాంబరం పోలీసు కమిషనర్ అబిన్ దినేష్ మోదక్, ఐజీలు కన్నన్ (సౌత్ చెన్నై అడిషనల్ కమిషనర్) ఏజీ బాబు (సమాచార సాంకేతిక విభాగం), కమిషనర్ ప్రవీణ్‌కుమార్, సూపరింటెండెంట్లు ఫెరోజ్ ఖాన్ అబ్దుల్లా, సువిష్‌కుమార్, కింగ్‌స్లిన్, శ్యామలా దేవి, ప్రభాకర్, బాలాజీ శరవణన్ తదితరులు రాష్ట్రపతి పతకాలకు ఎంపికయ్యారు. ఇదే విధంగా అడిషనల్ సూపరింటెండెంట్లు రాధాకృష్ణన్, స్టీఫెన్, డీఎస్పీలు ఢిల్లిబాబు, మనోహరన్, శంకు, సీఐలు చంద్రమోహన్, హరిబాబు, తమిళ్‌సెల్వి, ఎస్‌ఐలు మురళి, రవిచంద్రన్, మురళీధరన్ కూడా రాష్ట్రపతి పతకాలను అందుకోనున్నారు. ఈ పతకాలను నగరంలో త్వరలో జరిగే సభలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందించనున్నారు.

గ్రామీణ ఆలయాల మరమ్మతులకు రూ.50 కోట్లు

- నిర్వాహకులకు సీఎం స్టాలిన్ అందజేత



ముఖ్యమంత్రి స్టాలిన్ నుంచి చెక్కు అందుకుంటున్న ఆలయ నిర్వాహకురాలు

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 1250 ఆలయాలు, అదే విధంగా ఆదిద్రావిడులు, గిరిజనులు నివసించే ప్రాంతాల్లోని మరో 1250 ఆలయాల మరమ్మతు కోసం రూ. 50 కోట్లను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందజేశారు. సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ప్రతి ఆలయానికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ ఆర్థికసాయం అందుకున్న ఆలయాలకు ఎలాంటి స్థిరాస్తులు లేవని, ఏకకాల పూజలకు కూడా ఆర్థిక స్థోమత కూడా లేకపోవటంతో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతి గ్రామీణ ఆలయానికి ఇస్తున్న సహాయాన్ని రూ.లక్ష నుంచి రూ.2లక్షలకు పెంచామని స్టాలిన్ వివరించారు. ప్రస్తుతం 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎంపికచేసిన 2500 ఆలయాలకు తలా రూ.2లక్షల సహాయాన్ని పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ పీ చంద్రమోహన్, కమిషనర్ పీఎన్ శ్రీధర్, అదనపు కమిషనర్ డాక్టర్ ఇరా సుకుమార్, డిప్యూటీ కమిషనర్ (జీర్ణోద్ధరణ) పి. జయరామన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి ప్రింటింగ్ ప్రెస్‌లో కొత్త భవనం...

తిరుచ్చి జిల్లా దువాక్కుడి, సిడ్కో కాంప్లెక్స్‌లోని ప్రభుత్వ ముద్రణాలయం వద్ద రూ.1.82 కోట్లతో నిర్మించిన అదనపు భవనాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ భవనంలో వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వం పోటీ పరీక్షలకు అవసరమయ్యే ప్రశ్న పత్రాలు, ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన నోటీసులను ముద్రించి వాటిని భద్రపరచనున్నారని స్టాలిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖ మంత్రి ఎంపీ సామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ముద్రణ పరికరాలు, ముద్రణ శాఖ కమిషనర్ వి.శోభన, సమాచార శాఖ కార్యదర్శి వి.రాజారామన్, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు డాక్టర్ ఇరా వైద్యనాథన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల శాఖలో 180మందికి నియామకాలు...

సచివాలయంలో రహదారుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో టీఎన్‌పీఎస్సీ ద్వారా గ్రూపు-2ఏలో ఉత్తీర్ణులైన 180 మంది ఆ శాఖలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రహదారులు, మినీ ఓడరేవుల శాఖ మంత్రి ఈవీ వేలు, రహదారుల శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ ఆర్. సెల్వరాజ్, హైవేస్ ప్రిన్సిపల్ డైరెక్టర్ ఇరా సెల్వదురై, ప్రత్యేక అధికారి (సాంకేతిక పరిజ్ఞానం) ఆర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనంతరామన్

ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ అమలుపరచాలి

తమిళనాడు తెలుగు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అనంతరామన్

ప్యారీస్, ఆగస్టు 14: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎకనామికల్ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యుఎస్) రిజర్వేషన్ రాష్ట్రంలో అమలుచేయాలని తమిళనాడు తెలుగు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అనంతరామన్ డిమాండ్ చేశారు. చేపాక్కంలోని చెన్నై ప్రెస్ క్లబ్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అనంతరామన్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో తెలుగు మాతృభాషగా ఉన్న వారు సుమారు 40 శాతానికి పైగా నివసిస్తున్నారని, విద్య, ఉద్యోగావకాశాలు, చట్టసభల్లో స్థానం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కులాల వారీగా జనగణన చేపట్టాలని కోరారు. నాయకర్లు, విజయనగర ప్రభువులు, వీరపాండ్య కట్టబ్రహ్మన్న, ఓమందూర్ రామస్వామి రెడ్డి, వీవీ గిరి తదితర నేతలందరూ తెలుగు జాతి బిడ్డలేనని, వారి హయాం నుంచి రాష్ట్రంలో స్థిరపడి ఓటు హక్కు కలిగి, రేషన్ కార్డులున్నప్పటికీ ప్రభుత్వ పరమైన రాయితీలు వర్తింపజేయడం లేదని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల మేరకు 31 తెలుగు మైనార్టీ వర్గాలు లబ్ధిపొందేలా ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్యం చూపకుండా తక్షణం అమలుపరచాలని కోరారు. ఈ రాష్ట్రంలో నివసిస్తున్న తెలుగు వారిని శరణార్థులుగా కొంతమంది నాయకులు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చుతయ్య, రామదాసు, సుబ్రమణ్యం, రామస్వామి, నాగభూషణం, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరికి రాష్ట్ర హోదా

- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రంగస్వామి

పుదుచ్చేరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ బుధవారం ఉదయం రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ప్రతిపాదించిన తీర్మానం ఏకగ్రీవంగా సభామోదం పొందింది. రాష్ట్ర హోదా కల్పించాలంటూ పలువురు సభ్యులు వేర్వేరుగా చేసిన తీర్మానాలన్నింటినీ కలిపి ప్రభుత్వ తీర్మానంగా రంగస్వామి సభలో ప్రవేశపెట్టారు. పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించాలని ప్రధాన ప్రతిపక్ష నేత శివ, డీఎంకే ఎమ్మెల్యేలు నజీమ్, సెంథిల్‌కుమార్, ఇండిపెండెంట్ సభ్యుడు నెహ్రూ వ్యక్తిగత తీర్మానాలను ప్రవేశపెట్టారు. ప్రతిపక్షనేత శివ మాట్లాడుతూ... రాష్ట్రం తీసుకున్న రుణానికి రోజుకు రూ.2.7 కోట్ల చొప్పున వడ్డీ చెల్లిస్తున్నామని, ఈ దుస్థితి నుంచి బయటపడాలంటే పుదుచ్చేరికి రాష్ట్ర హోదా మినహా మరో గత్యంతరం లేదని అన్నారు. మరో శాసనసభ్యుడు నజీమ్ మాట్లాడుతూ.. రాష్ట్ర హోదా కోసం ఇప్పటికి 14 సార్లు అసెంబ్లీలో తీర్మానాలను ఆమోదించినా ఫలితం లేకపోయిందన్నారు. డీఎంకే సభ్యుడు సెంథిల్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పుదుచ్చేరికి కొత్త అధికారాలు కట్టబెట్టేందుకు సిద్ధంగా లేదని, ఉన్న అధికారాలను కూడా కుదించే ప్రయత్నంలో ఉందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రంగస్వామి చొరవ తీసుకుని పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించే దిశగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి రంగస్వామి ఢిల్లీ వెళ్లి తన పలుకుబడి ఉపయోగించి, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర హోదా ఉత్తర్వులను సాధించుకు రావాలని డిమాండ్ చేశారు.

విక్రవాండిలో వీకే తొలి మహానాడు

- త్వరలో వెట్రి కళగం జెండా ఆవిష్కరణ



ప్యారీస్, ఆగస్టు 14: నటుడు దళపతి విజయ్ స్థాపించిన 'వెట్రి కళగం' తొలి మహానాడు విల్లుపురం జిల్లా విక్రవాండిలో కోలాహలంగా జరుగనుంది. సెప్టెంబరు 22వ తేది మహానాడు జరపాలని పార్టీ అన్ని జిల్లాల నిర్వాహకుల వద్ద అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మహానాడు నిర్వహణకు ముందే పార్టీ జెండా పరిచయం చేస్తారని తెలిసింది. 2026 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నటుడు విజయ్ తమిళగ వెట్రి కళగం పేరుతో ఫిబ్రవరి 2వ తేది ప్రకటించారు. పార్టీని బలపరిచేలా అన్ని జిల్లాల్లో శాఖలు ఏర్పాటుచేసేలా నిర్వాహకులను కూడా నియమించారు. విక్రవాండి శాసనసభ నియోజకవర్గంలో మహానాడుకు అనువైన స్థలం ఎంపిక చేసే బాధ్యతలను పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌కు విజయ్ అప్పగించారు. ముందుగా ద్రావిడ పితామహుడు పెరియార్ జన్మించిన ఈరోడ్ జిల్లాలో తొలి మహానాడు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే దక్షిణాది జిల్లాల నుంచి వచ్చే పార్టీ నిర్వాహకులకు అవసరమైన రవాణా వసతులు అందుబాటులో ఉండవని భావించి ఈ ఆలోచన మానుకున్నారు. కొంతమంది పార్టీ సీనియర్లు ఇటీవల విజయ్‌తో సమావేశమై మహానాడు నిర్వహణ, ఏఏ అంశాలపై తీర్మానాల ఆమోదం వంటి అంశాలపై చర్చించి ముఖ్యమైన సలహాలు కూడా ఇచ్చినట్లు తెలిసింది. మరోవైపు తిరుచ్చి నగరంలో కానీ, మదురైలో కానీ మహానాడు జరిపేందుకు అవసరమైన స్థలాన్ని కూడా పరిశీలించారు. అయితే ఆ రెండు నగరాల్లో ఉన్న స్థల యజమానులు మహానాడు జరుపుకొనేందుకు అభ్యంతరం తెలియజేయడంతో ఈ ప్రయత్నం విరమించారు. మరోవైపున తిరుచ్చి పొన్మలై ప్రాంతంలో ఉన్న రైల్వే గ్రౌండ్‌ను అద్దెకు తీసుకోవాలని నిర్ణయించి, రైల్వే అధికారులను సంప్రదించారు. అయితే వారు కొన్ని నిబంధనలు విధించిన కారణంగా ఆ ప్రయత్నం కూడా మానుకున్నారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం విక్రవాండిలో డీఎంకే ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడికి చెందిన సూర్య కళాశాల సమీపంలో మహానాడు జరపాలని స్థలాన్ని కూడా ఎంపిక చేశారు. కాగా సెప్టెంబరు 22వ తేది సుబ్రమణ్యస్వామి వారికి నచ్చిన కార్తీక వ్రత పర్వదినం కావడంతో మహానాడు ఆ రోజునే నిర్వహిస్తే రాజకీయాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగవచ్చని బుస్సీ ఆనంద్ తన ఆస్థాన జ్యోతిష్యుడి వద్ద తేది నిర్ణయించినట్లు తెలిసింది.

బాణసంచా కర్మాగారంలో పేలుడు

- ఇద్దరు కార్మికుల దుర్మరణం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు సమీపంలోని టపాకాసుల కర్మాగారం వద్ద సంభవించిన పేలుడులో ఇద్దరు సంఘటనా స్థలంలోనే మరణించారు. టపాసుల కర్మాగారానికి ఓ వ్యాన్‌లో వచ్చిన రసాయన పదార్థాల క్యాన్‌లను అన్‌లోడింగ్ చేస్తుండగా పేలుడు సంభవించి ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే అశువులు బాసారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శివకాశి సమీపం పల్లపట్టికి చెందిన జయరాజ్ కేంద్ర పేలుడు పదార్థాల నియంత్రణ శాఖ అనుమతితో మల్లిమాయదేవన్‌పట్టిలో జయంతి ఫైర్‌వర్క్స్ అనే టపాకాయల కర్మాగారం నడుపుతున్నారు. ఆ కర్మాగారంలో 60 మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కర్మాగారాన్ని శివకాశికి చెందిన కన్నన్ లీజుకు తీసుకుని నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కార్మికులు కర్మాగారానికి వెళ్ళి బాణసంచా తయారు చేస్తున్నారు. ఉదయం 10 గంటల సమయంలో టపాసుల తయారీకి అవసరమైన రసాయనాల క్యాన్‌లతో ఓ వ్యాన్ వచ్చింది. కార్మికులు వ్యాన్‌లోని క్యాన్లను కర్మాగారంలోకి తీసుకెళ్తుండగా, ఉన్నట్టుండి క్యాన్‌ల మధ్య రాపిడి జరిగి మంటలు చెలరేగాయి. ఆ వెంటనే భారీ పేలుడు సంభవించింది. రసాయన పదార్థాలు భద్రపరచిన గది పూర్తిగా నేలమట్టమైంది. రసాయనాలు తెచ్చిన వ్యాన్‌కు కూడా మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఈ దుర్ఘటనలో నాగపాళయం ప్రాంతానికి చెందిన పుళ్లకుట్టి (65) కున్నూరుకు చెందిన కార్తీక్ ఈశ్వరన్ (31) అనే కార్మికులు దుర్మరణం చెందారు. బోస్ (35), మణికంఠన్ (31) అనే ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురించి తెలియగానే శ్రీవిల్లిపుత్తూరు అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో వెళ్ళి మంటలను అదుపు చేశారు. మల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

సీఎం స్టాలిన్ సంతాపం...: ఈ సంఘటన గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ మృతుల కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబీకులకు తలా రూ.3లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. అదే విధంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు కార్మికులకు తలా రూ.50వేలు చొప్పున ఆర్థికసాయం అందజేస్తామన్నారు.

సమాచార ధ్వని

మెట్రోలో ఫిర్యాదులకు ప్రత్యేక వెబ్‌సైట్

ఐసిఎఫ్, ఆగస్టు 14: మెట్రోరైళ్లు, స్టేషన్లలో పోగొట్టుకున్న వస్తువులకు సంబంధించి ఫిర్యాదుచేసేందుకు ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త వెబ్‌సైట్ పరిచయం చేశారు. నగరంలో రెండు మార్గాలో నడుస్తున్న మెట్రోరైళ్లలో ప్రతిరోజు సుమారు 3 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇదివరకే ప్రయాణికుల వసతులు, ఛార్జీ వివరాలు, ట్రావెల్ కార్డు, ప్రయాణికులు పాటించాల్సిన నిబంధనలు, హెల్ప్ లైన్ నెంబర్లు వంటివి అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ప్రయాణికులు తమ లగేజీలు, వస్తువులు పోగొట్టుకున్నా, చోరీకి గురైనా ఫిర్యాదు చేసేందుకు https://chennaimetrorail.org/ అనే వెబ్‌సైట్‌ను మెట్రోరైలు సంస్థ పరిచయం చేసింది.

టైలరింగ్ మిషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 14: మోటారు అమర్చిన టైలరింగ్ మిషన్ పొందేందుకు దివ్యాంగులు ఈ నెల 19వ తేది సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ తెలిపారు. 18 నుంచి 60 ఏళ్లలోపున్న దివ్యాంగులకు టైలరింగ్ మిషన్ పంపిణీ పథకం కింద టైలరింగ్ శిక్షణ పొందిన వారికి ఇంటర్వ్యూ చేసి ఎంపికైన వారికి అందజేస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు జాతీయ గుర్తింపుకార్డుతో https://www.tnesevai.tn.gov.in/Citizen/Registration.aspxl అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

'వైక్కం' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 14: రాష్ట్రప్రభుత్వం అందజేసే 'వైక్కం' పురస్కారానికి ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా తెలిపారు. బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషిచేస్తున్న సంస్థలు, వ్యక్తులకు ప్రతి ఏటా సెప్టెంబరు 17వ తేది ప్రభుత్వం ఈ పురస్కారం అందజేస్తోంది. ఈ ఏడాదికిగాను పురస్కారం పొందేందుకు అర్హులైన వారు 'ప్రభుత్వ కార్యదర్శి ప్రభుత్వ శాఖ, సచివాలయం, చెన్నై-9' అనే చిరునామాకు ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. పురస్కారగ్రహీతలకు రూ. లక్ష చెక్, సర్టిఫికెట్, పత్రం అందజేస్తారు.

రేపు ప్రైవేటు సంస్థల జాబ్ మేళా

పెరంబూర్, ఆగస్టు 13: చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 16వ తేది ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రైవేటు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమో, ఐటీఐ, 10,12 తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 35 ఏళ్లలోపున్న వారు జిల్లాకు చెందిన యువతీ, యువకులు విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలి. వివరాలకు 044-27426020 అనే నెంబరు సంప్రదించవచ్చు.

నేడు పాత నాణేల ప్రదర్శన

పెరంబూర్, ఆగస్టు 14: స్థానిక కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీలో గురువారం పాత, కొత్త నాణేల ప్రదర్శన జరుగనుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చెన్నై కాయిన్ క్లబ్ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏఏ నక్కీరన్ ఈ ప్రదర్శన ప్రారంభించనున్నారు. ప్రజలు ఉచితంగా ప్రదర్శన చూడవచ్చని క్లబ్ అధ్యక్షులు చెన్నై మణికంఠన్ ఒక ప్రకటనలో తెలిపారు.

17 నుంచి 'మద్రాసు డే' ఉత్సవాలు

ఐసిఎఫ్, ఆగస్టు 14:ఈనెల 17నుంచి 'మద్రాసు డే' ఉత్సవాలు వారం రోజుల పాటు జరుగనున్నాయి. చరిత్ర పరిశోధకులు దివంగత ముత్తయ్య, శ్రీరామ్, మోహన్ వి.రామన్, విన్సెంట్ డిసోజా, సత్యంభట్ వంటి వారు 2004లో మద్రాసు డే ఉత్సవాలు నిర్వహించడం ప్రారంభించారు. ఆ ప్రకారం, ప్రతి ఏటా ఆగస్టు రెండో వారంలో మద్రాసు డే ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం మద్రాసు అనే పేరును చెన్నైగా మార్చడంతో, 'చెన్నై డే' పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ఉపన్యాసాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు. శనివారం 385వ మద్రాసు డే ఉత్సవాలకు సంబంధించి క్విజ్, ఇతర పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 9841049155 వాట్సాప్ నెంబరు, 'మద్రాసు డే' వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

నేడు మద్యం దుకాణాలకు సెలవు

ఐసిఎఫ్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని టాస్మాక్ మద్యం దుకాణాలకు చెన్నై జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు. నగరంలో ఉన్న అన్ని మద్యం దుకాణాలు, బార్లు తప్పనిసరిగా మూసివేయాలని, ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘించే దుకాణాలపై కఠినచర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

పళనిలో కొత్త తలనీలాల కేంద్రం

పెరంబూర్, ఆగస్టు 14: పళని మురుగన్ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం పర్యాటక వాహనాలు నిలిపే ప్రాంతంలో కొత్తగా తలనీలాల సమర్పణ కేంద్రం బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ ఆలయంలో ఉత్సవాల రోజుల్లో ప్రతిరోజు సుమారు 20,000 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. అందుకోసం, పళని దేవస్థానం ఆధ్వర్యంలో షణ్ముగ నది సహా 7 ప్రాంతాల్లో తలనీలాల సమర్పణ స్థలాలుండగా, తాజాగా మరో స్థలం ఏర్పాటుచేశారు.

సివిల్ సప్లైస్ డీజీగా సీమా అగర్వాల్

పెరంబూర్, ఆగస్టు 14: సివిల్ సప్లైస్ సీఐడీ విభాగం డీజీగా బదిలీ అయ్యారు. తమిళనాడు యూనిఫాం సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆమెను బదిలీ చేస్తూ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఎయిర్ ఇండియా నుంచి మూడు కొత్త సేవలు

ఐసిఎఫ్, ఆగస్టు 14: చెన్నై నుంచి తిరువనంతపురం, భువనేశ్వర్, బాగ్‌డోగ్రా లకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కొత్త సేవలు ప్రారంభించింది. చెన్నై విమానాశ్రయం నుంచి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు ఉదయం 7.45 గంటలకు బయల్దేరే విమానం 9.30 గంటలకు అక్కడకు చేరుకుంటుంది. అనంతరం భువనేశ్వర్ నుంచి ఉదయం 10 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు చెన్నై చేరుకుంటుంది. చెన్నై నుంచి వెస్ట్ బెంగాల్ రాష్ట్రం బాగ్‌డోగ్రా కు మధ్యాహ్నం 12.35 గంటలకు బయల్దేరి 3.10 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి 3.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.15 గంటలకు చెన్నై చేరుకుంటుంది. చెన్నై నుంచి కేరళ రాష్ట్రం తిరువంతపురానికి సాయంత్రం 6.50 గంటలకు బయల్దేరే విమానం రాత్రి 8.20 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.50 గంటలకు బయల్దేరి 10.20 గంటలకు చెన్నై చేరుకుంటుంది.

కమిషనర్ కార్యాలయంలో గ్రీవెన్స్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, ఆగస్టు 14: స్థానిక ఎగ్మూర్‌లో ఉన్న పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్‌డ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి 35 వినతిపత్రాలు స్వీకరించి, వాటిని సత్వరం విచారించి పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి బుధవారం నిర్వహిస్తున్న ఈ గ్రీవెన్స్‌ను వినియోగించుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

మున్సిపాలిటీలుగా మహాబలిపురం, శ్రీపెరుంబుదూర్

ఐసిఎఫ్, ఆగస్టు 14: శ్రీపెరుంబుదూర్, మహాబలిపురం, తిరువయ్యారులను మున్సిపాలిటీలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మూడు ప్రాంతాలకు మున్సిపాలిటీ హోదా కల్పించనున్నట్లు శాసనసభలో ఆ శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ప్రకటించారు. ఆ ప్రకారం, ప్రస్తుతం పట్టణ పంచాయతీలుగా ఉన్న మహాబలిపురం, శ్రీపెరుంబుదూర్, తిరువయ్యారులను మున్సిపాలిటీలుగా మార్చుతూ రాష్ట్ర మున్సిపల్ నిర్వహణ శాఖ జీవో విడుదల చేసింది.

అరక్కోణం సమీపంలో సాంకేతికలోపం

● ఆగిన వందే భారత్ సహా పలు రైళ్లు

పెరంబూర్, ఆగస్టు 14: రాణిపేట జిల్లా అరక్కోణం సమీపం తిరువాలంగోడు రైల్వేస్టేషన్ ప్రాంతంలో బుధవారం ఉదయం 6.20 గంటలకు సిగ్నల్స్‌లో సాంకేతికలోపం తలెత్తింది. దీంతో, చెన్నై-అరక్కోణం-చెన్నై మధ్య రైళ్ల సేవలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని సిగ్నల్ వ్యవస్థను సరిచేయడంతో 7.50 గంటలకు రైళ్లు బయల్దేరి వెళ్లాయి. ఈ లోపు చెన్నై నుంచి మైసూరు వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్, శతాబ్ది ఎక్స్‌ప్రెస్, మైసూరు నుంచి చెన్నై వచ్చే కావేరి ఎక్స్‌ప్రెస్, జోలార్‌పేట నుంచి చెన్నై వెళ్లే ఏలగిరి ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి అరక్కోణం, తిరుత్తణి, అరక్కోణం నుంచి చెన్నై వెళ్లే మూడు సబర్బన్ రైళ్లను మధ్యలోనే నిలిపివేశారు. సిగ్నల్ సరిచేసిన తర్వాత ఒకదాని ఒకటిగా రైళ్లు బయల్దేరి వెళ్లాయి.

తలైయనై వెళ్లేందుకు పర్యాటకులకు నిషేధం

ఐసిఎఫ్, ఆగస్టు 14: తిరునల్వేలి జిల్లా కలక్కాడు తలైయనై వెళ్లేందుకు అటవీ శాఖ అధికారులు నిషేధం విధించారు. ఈ జిల్లాలో మూడు రోజులుగా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీంతో, ప్రజల భద్రత దృష్ట్యా మాంజోలై ప్రాంతంలో ఉన్న కలక్కాడు-ముండతురై పులుల శరణాలయం, పశ్చిమ కనుమల్లో ఉన్న తలైయనై, కాట్టారు జలపాతాల వద్దకు వెళ్లేందుకు పర్యాటకులకు నిషేధం విధించారు.

నేటినుంచి భవానీసాగర్ నీరు విడుదల

పెరంబూర్, ఆగస్టు 14: భవానీసాగర్ డ్యాం నుంచి తొలి ఆయకట్టుకు గురువారం నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. డిసెంబరు 12వ తేది వరకు 120 రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈరోడ్ జిల్లా సత్యమంగళం, గోపి, నంబియూర్, భవాని, పెరుందురై, ఈరోడ్, మొడకుర్చి, కొడుముడి, తిరుప్పూర్ జిల్లా కాంగేయం తాలూకా, కరూర్ జిల్లా అరవకుర్చి తాలూకా పరిధిలో మొత్తం 1,03,500 ఎకరాల్లో సాగు జరుగుతుందని ప్రభుత్వం ప్రకటనలో తెలిపింది.

మెట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

ఐసిఎఫ్,ఆగస్టు 14:మేట్టూరుడ్యాం ఇన్‌ఫ్లో బుధవారం తగ్గింది.కర్ణాటకలో కురుస్తున్న భారీవర్షాలకు కృష్ణరాజసాగర్, కబిని డ్యాంలు నిండిపోవడంతో మిగులు జలాలు కావేరి నదిలోకి విడుదల చేస్తున్నారు. జూలై 30వ తేది ఈ డ్యాం నిండడంతో డెల్టాకు సాగునీరు విడుదల చేయడంతో డ్యాం నీటిమట్టం తగ్గింది. కావేరి డెల్టా ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మళ్లీ ఈ డ్యాం రెండో సారి నిండింది. సోమవారం సెకనుకు 26 వేల ఘనపుటడుగులు నీరు వస్తుండగా, మంగళవారం 45వేల ఘనపుటడుగులకు పెరిగింది. ఈ నేపథ్యంలో, బుధవారం 26,864 ఘనపుటడుగులకు ఇన్‌ఫ్లో తగ్గింది. డ్యాం నీటిమట్టం 120 అడుగులుగా ఉంది. సెకనుకు 26 వేల ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు.

సికింద్రాబాద్-వేలాంకన్ని మధ్య ప్రత్యేక రైలు

పెరంబూర్, ఆగస్టు 14: వేలాంకన్ని ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ నుంచి వేలాంకన్నికి ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.07125 సికింద్రాబాద్-వేలాంకన్ని ప్రత్యేక రైలు ఈ నెల 27, సెప్టెంబరు 4 తేదీల్లో సికింద్రాబాద్‌లో ఉదయం 8.25 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు వేలాంకన్ని చేరుకుంటుంది. మరు మార్గంలో నెం.07126 వేలాంకన్ని-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 28, సెప్టెంబరు 5 తేదీల్లో వేలాంకన్నిలో రాత్రి 10.45 గంటలకు బయల్దేరి మూడో రోజు వేకువజామున 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, వేలూరు కంటోన్మెంట్ మీదుగా వేలాంకన్ని వెళ్లనుంది.

తేనీటి విందును బహిష్కరించిన డీఎంకే

ప్యారీస్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి గురువారం రాజ్‌భవన్‌లో నిర్వహించనున్న తేనీటి విందును అధికార డీఎంకే బహిష్కరించింది. ఈ మేరకు ఆ పార్టీ సీనియర్ నేత ఆర్ఎస్.భారతి విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, డీఎంకే కూటమి పార్టీలు గవర్నర్ తేనీటి విందును బహిష్కరిస్తున్నట్లు మంగళవారమే ప్రకటించాయి. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే గవర్నర్ తేనీటి విందులో పాల్గొంటుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తెలిపారు. పార్టీ తరపున మాజీ మంత్రులు డి.జయకుమార్, పి.బెంజిమెన్ పాల్గొంటారని తెలిపారు. అదే విధంగా పీఎంకే, తమిళ మానిల కాంగ్రెస్, బీజేపీ గవర్నర్ ఆహ్వానం మేరకు తేనీటి విందులో పాల్గొననున్నట్లు ప్రకటించాయి.

రాష్ట్రానికి నిధులేవీ?

ఎండీఎంకే అధినేత వైగో ఆగ్రహం ● చెన్నైలో భారీ ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో

ప్యారీస్, ఆగస్టు 14: కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో తమిళనాడుకు నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వాన్ని ఖండిస్తూ ఎండీఎంకే చెన్నై జిల్లా విభాగం ఆధ్వర్యంలో బుధవారం హార్బర్ నియోకవర్గంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వైగో నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో జిల్లా కార్యదర్శులు, కౌన్సిలర్ జీవన్, కుమార్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు. ధర్నాను ప్రారంభించి వైగో మాట్లాడుతూ నుంచి రాష్ట్రానికి మినహాయింపు ఇవ్వాలన్న కోరికను కేంద్ర ప్రభుత్వం పరిశీలించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని వ్యాఖ్యానించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తమిళనాడుకు నిధులు కేటాయించకపోవడం ఖండించదగ్గదని వైగో తెలిపారు.

హొగెనేకల్‌లో దోనెల సవారీకి అనుమతి

పెరంబూర్, ఆగస్టు 14: హొగెనేకల్ జలపాతాల మధ్య దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతులు మంజూరు చేసింది. కావేరి నదిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో హొగెనేకల్ సిన్నారు నుంచి కోత్తికల్, ప్రధాన జలపాతం, మనల్‌మేడు వరకు దోనెలు నడిపేందుకు అనుమతించారు. కాగా, హొగెనేకల్ జలపాతాల వద్ద పర్యాటకుల స్నానాలకు విధించిన నిషేధం 31వ రోజైన బుధవారం కూడా కొనసాగింది.

23 నుంచి మూడో విడత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

ఐసిఎఫ్, ఆగస్టు 14: ఇంజనీరింగ్ మూడో విడత కౌన్సెలింగ్ ఈ నెల 23 నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉన్న 1.80 లక్షల సీట్ల భర్తీకి మూడు విడతలుగా ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మొదటి విడత కౌన్సెలింగ్ జూలైలో ప్రారంభమై ఈనెల 10వ తేదీతో ముగిసింది. జనరల్, వృత్తి విద్యా విభాగాల్లో 19,922 మంది చేరారు. 10వ తేది ప్రారంభమైన రెండో విడత కౌన్సెలింగ్‌కు 77,948 మందిని ఆహ్వానించగా, వారిలో 62,270 మంది ఐచ్ఛిక సీట్లు ఎంపిక చేసుకున్నారు. వారిలో 55,875 మందికి తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల 7.5 శాతం రిజర్వేషన్ విభాగంలో 8,738 మంది ఐచ్ఛిక సీట్లు ఎంపిక చేసుకున్నారు. వారిలో 7,854 మందికి సీట్లు కేటాయింపు ఉత్తర్వులు అందజేశారు. ఈ క్రమంలో, రెండో విడతలో 63,729 మంది కి సీట్లు కేటాయించారు. మూడో విడత కౌన్సెలింగ్ ఈనెల 23 నుంచి సెప్టెంబరు 4వ తేది వరకు జరుగనుంది.

20 నుంచి దివ్యాంగుల బస్ పాస్ శిబిరాలు

ఐసిఎఫ్, ఆగస్టు 14: దక్షిణ, ఉత్తర చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లో ఉన్న అంధులు, దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ అందజేసే శిబిరాలు ఈ నెల 20వ తేది నుంచి జరుగనున్నాయి. దక్షిణ చెన్నైకు చెందిన దివ్యాంగులకు ఈ నెల 20,21,22 తేదీల్లో డీఎంఎస్ ప్రాంగణంలో ఉన్న జిల్లా దివ్యాగుల సంక్షేమ కార్యాలయం, కేకే నగర్ ఎస్సార్‌టీసీ కార్యాలయం, అడయార్‌లోని సెయింట్ లూయిస్ అంధ, బధిరుల మహోన్నత పాఠశాల, తేనాంపేటలోని సిరుమలర్ అంధుల పాఠశాల, ఉత్తర చెన్నైకి చెందిన దివ్యాంగులకు చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా దివ్యాంగుల సంక్షేమ విభాగంలో, తిరువొత్తియూర్ బధిరుల ప్రత్యేక పాఠశాల, అన్నానగర్ మేరీ క్లబ్ వాలా బధిరుల పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే శిబిరాల్లో ఉచిత బస్ పాస్‌లు అందజేస్తారు. అలాగే చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్ జిల్లాల్లో ఏర్పాటుచేసే శిబిరాల్లో ఆయా ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు ఉచిత బస్ పాస్ పొందవచ్చు.

కోవై విమానాశ్రయ విస్తరణపై సమీక్ష



విమానాశ్రయ విస్తరణ మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతికుమార్

పెరంబూర్, ఆగస్టు 14: కోయంబత్తూర్ విమానాశ్రయ విస్తరణకు సంబంధించి 97 శాతం భూసేకరణకు రూ.2,100 కోట్లు కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ పాడి తెలిపారు. కోవై విమానాశ్రయ విస్తరణకు సంబంధించిన సమావేశం బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో జిల్లా ఎస్పీ గణపతి రాజ్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ శివగురు ప్రభాకరన్, పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భూసేకరణకు సంబంధించి అభిప్రాయసేకరణలో తెలిపిన సమస్యలు రెండు వారాల్లో పరిష్కరించనున్నామని తెలిపారు.

కొనసాగుతున్న పాంబన్ జాలర్ల సమ్మె

పెరంబూర్, ఆగస్టు 14: శ్రీలంక జైళ్లలో ఉన్న పాంబన్ జాలర్లు, వారి పడవలను విడిపించేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతూ పాంబన్ నాటు పడవల జాలర్లు చేపట్టిన సమ్మె బుధవారం ఐదవ రోజు కొనసాగింది. పాంబన్ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన అలెక్స్ రంజన్, ఛార్లెస్, సూసై మార్టిన్‌లకు చెందిన నాలుగు పడవలు స్వాధీనం చేసుకున్న లంక నావికాదళం, ఆ పడవల్లోని 35 మంది జాలర్లను అరెస్ట్ చేసింది. వీరిపై ఛార్జిషీటు దాఖలైన నేపథ్యంలో ఆ దేశ న్యాయస్థానం ఈ నెల 22వ తేది వరకు రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో, శ్రీలంక జైళ్లలో ఉన్న రాష్ట్ర జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలను విడుదల చేసే ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ పాంబన్ నాటు పడవ జాలర్లు గత శనివారం నుంచి సమ్మెకు దిగారు. సమస్య పరిష్కరించకుంటే ఈ నెల 20వ తేది పాంబన్ వంతెన వద్ద రాస్తారోకో చేపట్టనున్నట్లు జాలర్ల సంఘాలు ప్రకటించాయి.

బీజేపీ తిరంగా ర్యాలీకి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

ప్యారీస్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో తిరంగ ర్యాలీ నిర్వహించేందుకు మద్రాసు హైకోర్టు అనుమతులు మంజూరు చేసింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకంతో ద్విచక్రవాహనాల ర్యాలీకి అనుమతి కోరుతూ ఈ నెల 10వ తేది బీజేపీ సమర్పించిన వినతిపత్రాన్ని పోలీసు శాఖ నిరాకరించింది. దీన్ని వ్యతిరేకిస్తూ కోవై జిల్లా బీజేపీ కార్యదర్శి కృష్ణప్రసాద్ దాఖలుచేసిన పిటిషన్ బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జి.జయచంద్రన్ సమక్షంలో విచారణకు వచ్చింది. ప్రభుత్వం తరపున హాజరైన అడిషినల్ అడ్వొకేట్ జనరల్, ప్రజలకు, వాహనాలకు ఇబ్బంది కల్పించే విధంగా బీజేపీ నిర్వహించదలచిన ర్యాలీకి అనుమతించకూడదని విన్నవించారు. ఇరుతరపు వాదనల అనంతరం జాతీయ జెండా నిబంధన పాటిస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా బీజేపీ ర్యాలీ చేసుకోవచ్చని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

కొడైకెనాల్‌కు లక్షల్లో పర్యాటకులు

పెరంబూర్, ఆగస్టు 14: ప్రముఖ పర్యాటక కేంద్రం కొడైకెనాల్‌లో ఈ-పాస్ విధానం అమలులోకి వచ్చిన 98 రోజుల్లో 6.52 లక్షల మంది పర్యాటకులు వచ్చారు. హైకోర్టు ఉత్తర్వులతో ఊటీ, కొడైకెనాల్ వంటి పర్యాటక ప్రాంతాల్లో వచ్చే వాహనాలకు ఈ-పాస్ ఉండాలనే నిబంధన అమలుకు వచ్చినప్పటి నుంచి మంగళవారం వరకు ఈ-పాస్ పొందిన లక్ష వాహనాల్లో 6.52 లక్షల మంది పర్యాటకులు కొడైకెనాల్‌ను సందర్శించారని, ఈ నిబంధన సెప్టెంబరు 30వ తేది వరకు అమలులో ఉంటుందని జిల్లా యంత్రాంగం ప్రకటించింది.

2025 హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 14: ముస్లింల పవిత్ర స్థలం హజ్ 2025 యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి ఉన్న తమిళనాడుకు చెందిన ముస్లింలు దరఖాస్తు చేసుకోవాలని ముంబైలో ఉన్న ఇండియా హజ్ కమిటీ దరఖాస్తు స్వీకరణ ప్రారంభించింది. రాష్ట్రానికి చెందిన వారు ఈ నెల 13 నుంచి అక్టోబరు 9వ తేది వరకు ఠీఠీఠీ.జ్చీ ఛిౌఝఝజ్టీ్ట్ఛ.జౌఠి.జీ ఆన్‌లైన్‌లో అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే, ఐఫోన్, ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లలో ఏఅజ ఞ్ఛఠఈఏఅ అనే యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన వారు ఉచితంగా దరఖాస్తు సమర్పించవచ్చు. పాస్‌పోర్ట్ మొదటి, చివరి పేజీలు, బ్లాక్ అండ్ వైట్ పాస్‌పోర్ట్ ఫొటోలు, క్యాన్సిల్ చేసిన చెక్కు, బ్యాంక్ ఖాతా పుస్తకం, చిరునామా తదితర సర్టిఫికెట్లు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. మరిన్ని వివరాలు, సందేహాలకు అదే వెబ్‌సైట్ చూడవచ్చు.

ఒక్క దళితుడు కూడా ముఖ్యమంత్రి కాలేదు

● డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్



నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న తిరుమావళవన్

పెరంబూర్, ఆగస్టు 14: ఎలాంటి పరిస్థితుల్లోనైనా, ఏ కాలంలోనైనా దళితుడు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాలేరని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళన్ ఆవేదన వ్యక్తం చేశారు. షెడ్యూల్ కులాల రిజర్వేషన్ హరించివేసే సుప్రీంకోర్టు తీర్పును ఖండిస్తూ డీపీఐ ఆధ్వర్యంలో నగరంలో ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్ మాట్లాడుతూ... ఉత్తరప్రదేశ్‌లో గతంలో మాయావతి ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఆ తర్వాత దేశంలో ఏ రాష్ట్రానికి కూడా దళితుడు ముఖ్యమంత్రి కాలేదన్నారు. ఈ విషయమై, పార్లమెంటులో ఎందుకు చర్చించరో అందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో కూడా ఒక దళితుడు ముఖ్యమంత్రి అయ్యేందుకు అంగీకరించరు... కాలేరు కూడా అని అన్నారు. వన్నియర్లకు 10.5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ కోరిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న ఎడప్పాడి పళనిస్వామి, ఏ ఇతర సామాజిక వర్గాన్ని పట్టించుకోకుండా, ఎవరితో సంప్రదించకుండా, అఖిలపక్ష ఏర్పాటుచేయకుండా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత ఆ అంతర్గత కేటాయింపు న్యాయపరమైన చిక్కుల్లో పడి నేటికీ స్తబ్దుగా ఉందన్నారు. అంతర్గత కేటాయింపు అధికారాన్ని రాష్ట్రప్రభుత్వాల చేతుల్లో పెట్టకూడదని భావించిన అంబేడ్కర్, రాజ్యాంగంలో ఎస్సీలందరినీ ఒకే షెడ్యూల్‌గా చేర్చారని తెలిపారు. తర్వాత అది సరికాదని గుర్తించి దానికి ఆర్టికల్ 341,342, జోడించారని తెలిపారు. 341 జాబితా సమాజానికి సంబంధించిందని, గిరిజన సంఘం గురించి 342పై ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా పార్లమెంటులో చర్చించి రాష్ట్రపతి ఆమోదంతోనే తీసుకురావాలని అంబేడ్కర్ తీసుకొచ్చారన్నారు. డీఎంకే ప్రభుత్వంపై మాకు నమ్మకం ఉందని, రాష్ట్రప్రభుత్వం సుస్థిరంగా ఉంద న్నార ు. దేశంలో షెడ్యూల్ కమ్యూనిటీ అధికంగా ఉన్న రాష్ట్రం పంజాబ్ అని, అక్కడ ఎస్సీ, ఎస్టీల జనాభా 32 శాతం ఉందన్నారు. 32 శాతం సంఘం స్వతహాగా రాజకీయ శక్తిగా ఆవిర్భవిస్తే, వారు శాశ్వత అధిపతులు కాగలరని, కానీ, ముందుగానే 1975లో వర్గీకరణ పేరుతో దాన్ని బద్దలు కొట్టారని తిరుమావళవన్ పేర్కొన్నారు. కాగా, తిరుమావళవన్ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, నామ్ తమిళర్ పార్టీ అధ్యక్షుడు సీమాన్ ఆహ్వానించారు.

మంత్రి ఉదయనిధికి సుప్రీంకోర్టులో ఊరట

● నేరుగా విచారణకు హాజరుపై మినహాయింపు
● కేసులు రాష్ట్రానికి బదిలీ చేసేందుకు 'నో'



పెరంబూర్, ఆగస్టు 14: సనాతన ధర్మం వ్యవహారానికి సంబంధించి పలు రాష్ట్రాల్లో దాఖలైన కేసులకు, మంత్రి ఉదయనిధి ప్రత్యక్ష హాజరుపై సుప్రీంకోర్టు మినహాయింపు కల్పించింది. ఈ కేసులన్నీ తమిళనాడుకు మార్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. నగరంలో గత ఏడాది సెప్టెంబరు 2వ తేది సనాతన నిర్మూలన మహానాడు జరిగింది. అందులో పాల్గొన్న రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి, సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా తదితరాల్లా నిర్మూలించాలని మాట్లాడారు. దానిని దేశ వ్యాప్తంగా ఉన్న హిందూ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు పలు రాష్ట్రాల్లో 8 కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, ఉదయనిధి తరఫున సుప్రీంకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... పలు రాష్ట్రాల్లో దాఖలైన కేసులన్నీ ఒకే ప్రాంతంలో విచారించాలని కోరారు. ఈ పిటిషన్ బుధవారం విచారించిన న్యాయస్థానం... కేసుల విచారణకు ఉదయనిధి నేరుగా హాజరుకావడంపై మినహాయింపు కల్పించింది. కేసులు తమిళనాడు మార్చలేమన్న న్యాయస్థానం, ఈ కేసులో ప్రతివాదులు బదులు పిటిషన్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

15 మంది జూదరుల అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 14: స్థానిక తేనాంపేటలో జూదమాడుతున్న 15 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. తేనాంపేట తిరువళ్లువర్ రోడ్డులోని ఓ ఇంట్లో కొందరు పేకాడుతున్నట్లు పోలీసులు సమాచారం అందింది. మంగళవారం సాయంత్రం ఆ ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు, పొరుగు రాష్ట్రాలకు చెందిన కరణ్‌బాదూర్, ముఖేష్‌కుమార్, తేజ్‌పత్, భూండేవ్, సూరజ్‌రాణా సహా 15 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.94,760 స్వాధీనం చేసుకున్నారు.

వృభిచారం చేయిస్తున్న ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 14: స్థానిక మడిపాక్కంలో వృభిచార వృత్తి సాగిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మడిపాక్కం అన్నానగర్ 9వ వీధిలోని ఓ ఇంట్లో వృభిచారం జరుగుతుందనే సమాచారంతో మడిపాక్కం పోలీసులు మంగళవారం రాత్రి ఆకస్మికతనిఖీలు చేపట్టారు. ఈ ఇంట్లో వృభిచారం చేయిస్తున్న సైదాపేట జ్యోతి అమ్మన్ నగర్‌కు చెందిన ఝాన్సీ అలియాస్ పూర్ణిమ (35), కేరళ రాష్ట్రం పద్దన్‌దిట్ట జిల్లాకు చెందిన అభిదేవ్ (22)లను అరెస్ట్ చేసిన పోలీసులు వృభిచార వృత్తిలో ఉన్న ఇద్దరు మహిళలను ప్రభుత్వ హోంకు తరలించారు.

రూ.150 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం స్వాధీనం

ఐసిఎఫ్, ఆగస్టు 14: తిరువళ్లూర్ జిల్లా చోళవరం సమీపంలో సబ్బుల తయారీ సంస్థ ఆక్రమణలో ఉన్న రూ.150 కోట్ల విలులైన ప్రభుత్వ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పట్టా ద్వారా రెండేళ్ల క్రితం ఆ సంస్థ యాజమాన్యం 14.5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించింది. ఈ విషయం గుర్తించిన రెవెన్యూ శాఖ అధికారులు, అందులో ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీచేశారు. ఉత్తర్వులు ఖాతరు చేయకపోవడంతో మంగళవారం పొన్నేరి తహసీల్దార్ నేతృత్వంలో అధికారులు, పోలీసులు వెళ్లి ఆక్రమణలు తొలగించి స్థలం స్వాధీనం చేసుకున్నారు.

అన్నాడీఎంకే అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలకు రూ.2,500

● మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ



పార్టీ సభ్యత్వ గుర్తింపుకార్డు అందజేస్తున్న రాజేంద్ర బాలాజి

పెరంబూర్, ఆగస్టు 14: అన్నాడీఎంకే అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు రూ.2,500 అందజేస్తామనిమాజీ మంత్రి టీకే రాజేంద్ర బాలాజీ తెలిపారు. శివకాశి శాసనసభ నియోజకవర్గంలో అన్నాడీఎంకేలో సభ్యులుగా చేరిన వారికి గుర్తింపుకార్డులు అందించే కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో రాజేంద్ర బాలాజీ మాట్లాడుతూ... అన్నాడీఎంకేలో కార్యకర్తలకు ఉన్నత పదవులు దక్కుతాయని, వారసత్వ రాజకీయాలు పార్టీలో లేవన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో మోదీ వద్దు అని ఒక కూటమి, మోదీ కావాలని మరో కూటమి ఎన్నికలకు సిద్ధం కాగా, వాటిని అధిగమించి పోటీచేసిన అన్నాడీఎంకే అధిక ఓట్లు సాధించిందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే తిరిగి అధికారం చేపట్టడం తథ్యమని, అందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాజేంద్ర బాలాజీ నమ్మకం వ్యక్తం చేశారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి



గోపిక (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, ఆగస్టు 14: కొల్లిమలైలోని మహేంద్రవనం అనే హోటల్‌లో శిక్షణ పొందుతున్న 17 ఏళ్ల క్యాటరింగ్ విద్యార్థిని మృతిపై పోలీసులు విచారణ చేపట్టారు. నెల్లిపాళయం హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న నామక్కల్ జిల్లా కల్యాణికి చెందిన గోపిక, కొల్లిమలై హోటల్‌లో సహచర విద్యార్థులతో ఉంటోంది. ఈ క్రమంలో, గోపిక బాత్రూమ్‌లో స్పృహతప్పి పడిపోయినట్లు తెలిసింది. ఆమెను తోటి విద్యార్థులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. గోపిక మృతి వ్యవహారంలో అనుమానం ఉందని, పోలీసులు తగిన చర్యలు చేపట్టలేదని పేర్కొంటూ బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టడం కలకలం రేపింది.

ఆక్రమణ దుకాణాల తొలగింపునకు ప్రత్యేక వాహనం



పెరంబూర్, ఆగస్టు 14: స్థానిక మెరీనా, బీసెంట్ నగర్ బీచ్ ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపునకు రూ.48 లక్షలతో మూడు ఆధునిక వాహనాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కొనుగోలు చేసింది. నగరం, పొరుగు జిల్లాలు, రాష్ట్రాల ప్రజలు అధికంగా మెరీనా, బీసెంట్ నగర్ బీచ్‌లలో సేదతీరుతుంటారు. ఆ ప్రాంతాలు శుభ్రంగా ఉంచడం, ప్రజలకు భద్రత కల్పించడంపై జీసీసీ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అదే సమయంలో, జీసీసీ అనుమతించిన ప్రాంతాల్లో హోటళ్లు, టీ, శీతల పానీయాలు సహా పలురకాల దుకాణాలున్నాయి. ఈ దుకాణాల్లో పోగయ్యే వ్యర్థాలను యజమానులు ఇసుకలో పోస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. అదే సమయంలో కొందరు అనుమతి లేకుండా దుకాణాలు పెడుతున్నారు. ప్రతిరోజు వీటిని పర్యవేక్షించడం జీసీసీకి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో, బీచ్‌ల్లో గస్తీ తిరుగుతూ ఆక్రమణ దుకాణాలను పర్యవేక్షించేలా తలా రూ.16 లక్షలతో మూడు అధునాతన వాహనాలు (ఆల్ టెర్రియన్ వెహికల్-ఏటీవీ) కొనుగోలు చేయనుంది. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ... తొలగించిన దుకాణాలు మళ్లీ ఏర్పాటుచేస్తే వాటిని పర్యవేక్షించేందుకు ఈ వాహనాలు వినియోగించనున్నామన్నారు. ఈ వాహనాలు తారు రోడ్డు, ఇసుకలో సులభంగా వెళతాయని, అదే సమయంలో ఏటీవీ వాహనం గస్తీకి కూడా ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

రూ.9.35 కోట్లతో సస్పెన్షన్ బ్రిడ్జి

ఐసిఎఫ్, ఆగస్టు 14: స్థానిక పట్టణంబాక్కం తొల్‌కాపియ పార్క్‌లో రూ.9.35 కోట్లతో సస్పెన్షన్ బ్రిడ్జి ఏర్పాటుచేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 2007లో అడయార్ ఉప్పంకలి ప్రాంతంలో 58 ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్ల వ్యయంతో తొల్‌కాపియ పార్క్‌కు శంకుస్థాపన చేసి 20111లో ప్రారంభించారు. అనంతరం ఈ పార్క్‌ను అన్నాడీఎంకే ప్రభుత్వం అడయార్ పర్యావరణ పార్క్‌గా పేరు మార్చింది. సరైన పర్యవేక్షణ లేక అధ్వాన్నంగా మారిన ఆ పార్క్ అభివృద్ధికి డీఎంకే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2023 జూన్‌లో రూ.20 కోట్లతో పార్క్ పునరుద్ధరణ పనులు ప్రారంభమై ఇటీవల పూర్తయ్యాయి. ఇందులో భాగంగా రూ.9.35 కోట్లతో పార్క్‌లో సస్పెన్షన్ బ్రిడ్జి ఏర్పాటుచేశారు.

చిత్రజ్యోతి

గొప్పగా ప్రచారం చేసుకోను

● శివకార్తికేయన్ ● సూరి నటనకు జాతీయ అవార్డు తథ్యం

ప్రతిభ కలిగిన వారిని గుర్తించి, వారికి తానే జీవితాన్ని ప్రసాదించినట్టుగా ప్రచారం చేయనని, ఎందుకంటే తన విషయంలో అలాంటి ప్రచారమే జరిగిందని హీరో శివకార్తికేయన్ (ఎస్కే) పేర్కొన్నారు. 'కొట్టుకాలి' చిత్రంలో హీరో సూరి నటనకు జాతీయ అవార్డు తథ్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్కే ప్రొడక్షన్స్ పతాకంపై పీఎస్ వినోద్ రాజ్ దర్శకత్వంలో శివకార్తికేయన్ నిర్మించిన చిత్రం 'కొట్టుకాలి' త్వరలో విడుదలకానుంది. సూరి, అన్నాబెన్ హీరోహీరోయిన్లు. ఈ సినిమా ఆడియో, ట్రైలర్ రిలీజ్ నగరంలో తాజాగా జరిగింది. ఇందులో నటుడు,నిర్మాత శివకార్తికేయన్ మాట్లాడుతూ, 'దర్శకుడు వినోద్ రాజ్ రూపొందించిన 'కూళంగల్' చూసి, ఆ స్టోరీ అర్థం చేసుకునేందుకు చాలా కష్టపడ్డాను. తమిళ సినిమా చూస్తూ పెరిగాను. తమిళంలో వచ్చిన అనేక వైవిధ్య భరితమైన చిత్రాల చూసి అవగాహన పెంచుకున్నాను. కొత్త దర్శకులకు అంతర్జాతీయ స్థాయిలో రోటర్ డ్యామ్ ఇస్తారు. 'కూళంగల్' మూవీకి వినోద్ రాజ్‌కు గతంలో క్రిస్టోఫర్ నోలన్‌కు వచ్చింది. మదురై నుంచి వచ్చిన వినోద్ రాజ్ ఒక అంతర్జాతీయ అవార్డు గెలుచుకున్నాడు. అపుడే నిర్ణయం తీసుకున్నా. మా బ్యానర్‌పై తదుపరి చిత్రాన్ని వినోద్ రాజ్‌తో నిర్మించాలని. 'కొట్టుకాలి' సినిమాకు కోసం పెట్టుబడిపోగా లాభాలు వస్తే తదుపరి చిత్రానికి అడ్వాన్స్ ఇస్తాను. వినోద్ రాజ్ తమిళ సినిమాకు లభించిన ఒక ఆణిముత్యం. ఊహించని విధంగా లాభాలు వస్తే మాత్రం వినోద్ రాజ్ వంటి వారు ఎక్కడ ఉన్నారో వారిని గుర్తించి, వారికి అడ్వాన్స్ ఇస్తాను. నాకు జీవితాన్ని ప్రసాదించిన సినిమాకు తిరిగి ఇవ్వాలన్న చిన్న ప్రయత్నమే ఇది. ఈ సినిమాకు సంగీత దర్శకుడు లేరని చెప్పగా ఆశ్చర్యపోయాను. అయినా కొత్త అనుభూతిని ఇచ్చేలా ఉంటుంది. హీరో సూరి అద్భుతమైన నటుడు. ముస్ముందు ఎస్కే ప్రొడక్షన్ నుంచి ఇలాంటి మంచి చిత్రాలే వస్తాయి' అని పేర్కొన్నారు. నటుడు సూరి మాట్లాడుతూ, అనేక చిత్రాల్లో నటించాను కానీ, ఈ చిత్రం విడుదలకు ముందే ప్రశంసలు రావడం ఎంతో ఆనందంగా ఉంది. మా తల్లిదండ్రుల ఆశీర్వాదబలమే కారణం. ఇలాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చిన దర్శక నిర్మాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకులు వెట్రిమారన్, మిష్కిన్, హీరోయిన్ అన్నాబెన్ తదితరులు పాల్గొన్నారు.


'కొట్టుకాలి' ఆడియో రిలీజ్ దృశ్యం

శీను రామస్వామి దర్శకత్వంలో 'కోళి పన్నై చెల్లదురై'

తమిళ చిత్రపరిశ్రమలో వాస్తవిక కథాంశాలతో సినిమాలను రూపొందించే దర్శకుల్లో శీను రామస్వామి ఒకరు. ఈయన తాజాగా దర్శకత్వం వహించిన చిత్రం 'కోళి పన్నై చెల్లదురై'. విజన్ సినిమా హౌస్ ప్రొడక్షన్ పతాకంపై 'జో' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ నిర్మించిన టి.అరుళానంద్, మాథ్యూ అరుళానంద్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఏగన్, బ్రిగిడ హీరోహీరోయిన్లుగా నటించగా హాస్య నటుడు యోగిబాబు ఓ ముఖ్యపాత్ర పోషించారు. తేని, ఆండిపట్టి తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకుంది. ఈ సినిమా టీజర్‌ను బుధవారం విడుదల చేశారు. కాగా, విజయ్ సేతుపతి హీరోగా శీను రామస్వామి తెరకెక్కించిన 'మామణిదన్' చిత్రం 2022లో విడుదలై అందరి ప్రశంసలు అందుకుంది. అలాగే, పార్తిబన్ స్వీయనిర్మాణంలో రూపొందిన 'ఇరవిన్ నిళల్' మూవీలో బ్రిగిడ సహ హీరోయిన్‌గా నటించి మంచి గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.


'కోళి పన్నై చెల్లదురై' యోగిబాబు, ఏగన్



'మహారాణి'గా నయనతార?

అగ్రహీరోయిన్ నయనతార వెండితెరపై 'మహారాణి'గా కనిపించనున్నారు. విజయ్ సేతుపతి నటించిన 'మహారాజ' చిత్రానికి దర్శకత్వం వహించిన నితిలన్ స్వామినాథన్ ఈ చిత్రానికి కూడా దర్శకత్వం వహించనున్నారు. తక్కువ బడ్జెట్‌లో రూపొందించిన 'మహారాజ' ఘన విజయం సాధించడమే కాకుండా ఏకంగా రూ.100 కోట్ల కు పైగా కలెక్షన్లు రాబట్టింది. ప్యాషన్ స్టూడియోస్ బ్యానరుపై సుధన్ సుహాన్ నిర్మించారు. ఈ సినిమా చూసిన స్టార్ హీరోలు రజనీకాంత్, విజయ్ వంటి వారు యువ దర్శకుడు నితిలన్ స్వామినాథన్‌ను తమ నివాసానికి ఆహ్వానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ నేపథ్యంలో నితిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో ప్యాషన్ స్టూడియో ఓ చిత్రాన్ని ప్లాన్ చేసింది. ఇందులో ప్రధాన పాత్ర నయనతార పోషించనుండగా, ఈ సినిమాకు 'మహారాణి' అనే టైటిల్ ఖరారు చేసినట్టు సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.


సత్యరాజ్, కూల్ సురేష్, నాంజిల్ సంపత్ తదితరులు

'తోళర్ చేగువేరా'గా సత్యరాజ్

తమిళ చిత్రపరిశ్రమలోని వెర్సటైల్ నటుడైన సత్యరాజ్ వైవిధ్యమైన పాత్రలను ఎంపిక చేసుకుని, వాటికి న్యాయం చేసేందుకు తన వంతు కృషిచేస్తుంటారు. ఇటీవల 'వెపన్' మూవీలో సత్యరాజ్ సూపర్ హ్యూమన్‌గా కనిపించారు. అలాగే, విజయ్ ఆంటోనీ నటించిన 'మళై పిడిక్కాద మణిదన్'లోనూ ఆయన మరో మంచి పాత్ర పోషించి ప్రశంసలు పొందారు. ఇపుడు 'తోళర్ చేగువేరా' (కామ్రేడ్ చేగువేరా)గా ప్రేక్షకుల ముందుకురానున్నారు. ఇందులో సత్యరాజ్‌తో పాటు మొట్టై రాజేంద్రన్, నాంజిల్ సంపత్, కూల్ సురేష్, అలెక్స్ తదితరులు నటించారు. ఈ మూవీ ట్రైలర్ ఇటీవల విడుదల చేశారు. సెప్టెంబరు 20న సినిమా విడుదల చేయనున్నట్టు దర్శక నిర్మాతలు ప్రకటించారు. అలెక్స్ ఏడీ కథ సమకూర్చి దర్శకత్వం వహించగా, జీఎంసీ పతాకంపై అనీష్ ఎడ్మండ్ ప్రభు నిర్మించారు. ట్రెండ్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనుంది.

జాతీయ జెండాలతో 'తిరంగా రన్'


జాతీయ జెండాలతో విద్యార్థుల తిరంగా రన్


జాతిపిత, సుభాష్ చంద్రబోస్ వేషధారణలో చిన్నారులు


రాణి మంగమ్మగా...


పండిత జవహర్‌లాల్ నెహ్రూగా...


ఝాన్సీ లక్ష్మీభాయ్‌గా..

● సమరయోధుల వేషధారణలో చిన్నారుల సందడి

ప్యారీస్, ఆగస్టు 14: రాజధాని నగరంలో ఒక రోజు ముందే పంద్రాగస్టు సందడి నెలకొంది. థౌజండ్ లైట్స్ నియోజకవర్గంలో ఉన్న ఆసాన్ మెట్రిక్యులేషన్ పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆహ్వానిస్తూ కోలాహలంగా వేడుకలు జరుపుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు విద్యార్థులు జాతీయ జెండాలతో ఉత్సాహంగా తిరంగా రన్‌లో పాల్గొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహనీయులను గుర్తుచేస్తూ గాంధీ, నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, డా.బీఆర్ అంబేడ్కర్, వీరవనితలు రాణి మంగమ్మ, ఝాన్సీ లక్ష్మీ భాయ్ తదితరుల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ గీతాలాపన, దేశ నాయకుల చరిత్రలు వల్లిస్తూ విద్యార్థులు దేశభక్తి చాటుకున్నారు.

రూ.3.57 కోట్లతో ఏలగిరి ఎకో టూరిజం స్పాట్

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఏలగిరిలో ఎకో టూరిజం స్పాట్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, అటవీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో తిరుపత్తూరు జిల్లాలో రూ.3.57 కోట్లతో చేపట్టిన మరమ్మతులతో కొత్త హంగులు సంతరించుకున్న ఏలగిరి - జలకంపారై ఎకోటూరిజం స్పాట్‌ను సచివాలయం నుంచి ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇదే విధంగా 29 జిల్లాల్లో ప్రభుత్వ స్థలాల్లో రాష్ట్ర హరిత ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన 75 మరకత పుష్పవనాలు, చెన్నై కాశిమేడులో రూ.22.42 లక్షలతో చేపల వలల సేకరణ కేంద్రం, రూ.1.50 కోట్లతో రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పర్యావరణ నిఘా కేంద్రాన్ని కూడా ఆయన ప్రారంభించారు. మరకత పుష్ప వనాల్లో రేగు, ఉసిరి, కొబ్బరి, బాదం, జామ, అత్తి, బిల్వ, మామిడి, వేప చెట్లను విస్తారంగా పెంచినట్లు స్టాలిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాఖ మంత్రి శివ వీ మెయ్యనాథన్, అటవీ శాఖ మంత్రి డాక్టర్ ఎం.మదివేందన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి పి.సెంథిల్‌కుమార్, ప్రిన్సిపల్ ఫారెస్ట్ కన్సర్వేటర్ సుధాంశు గుప్తా, హరిత ఉద్యమ ప్రధాన ప్రణాళికాధికారి దీపక్ శ్రీవాత్సవ తదితర అధికారులు పాల్గొన్నారు.


ఎకో టూరిజం స్పాట్‌ను ప్రారంభిస్తున్న సీఎం

సీఎంకు మురుగన్ మహానాడు ఆహ్వానపత్రిక


సీఎం దంపతులకు ఆహ్వానపత్రం అందజేస్తున్న పీఠాధిపతులు

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం పళనిలో ఈ నెల 24న ప్రారంభం కానున్న అంతర్జాతీయ ముత్తమిళ్ మురుగన్ మహానాడు ఆహ్వానపత్రికను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్‌కు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, మహానాడు సమన్వయకర్తలైన మఠాధిపతులు అందజేశారు. బుధవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి దంపతులను మంత్రితో పాటు తిరువణ్ణామలై ఆధీనం పొన్నంబళ దేశిక పరామాచార్య స్వామి, పేరూరు ఆధీనం శాంతలింగ మరుదాచల అడిగళార్, శిరవై ఆధీనం కుమారగురుబరస్వామి, మయిలం బొమ్మపుర ఆధీనం శివజ్ఞాన బాల్య స్వామి, ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు సుకి శివం, ఎంపీ సత్యవేల్ మురుగనార్, దేశమంగయర్క్కరసి తదితరులు కలుసుకుని ఆహ్వానపత్రికను అందించి మహానాడులో పాల్గొనాలని ఆహ్వానించారు.

ఘనంగా చెన్నై డివిజన్ ఆవిర్భావ దినోత్సవం

పెరంబూర్, ఆగస్టు 14: దక్షిణ రైల్వేలో చెన్నై డివిజన్ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నై డివిజన్ పరిధిలోని డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్, చెన్నై ఎగ్మూర్, చెన్నై బీచ్, తాంబరం, చెంగల్పట్టు, అరక్కోణం, జోలార్‌పేట, సూళ్లూరుపేట, తిరువళ్లూర్, ట్రిప్లికేన్, వేళచ్చేరి రైల్వేస్టేషన్లలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. డా.ఎంజీఆర్ సెంట్రల్ రైల్వేస్టేషన్ ఈ ఎగ్జిబిషన్‌ను వీరనారి శోభా సుధాకర్, మేజర్ వినాయక్ సీతారామన్ ప్రారంభించారు. చెన్నై డివిజన్ మేనేజర్ బి.విశ్వనాథ్ ఈరా, అడిషినల్ డివిజినల్ మేనేజర్ తేజ్‌ప్రతాప్ సింగ్, సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు

డీఎంకేలో భారీ మార్పులు

● 2 నియోజకవర్గాలకు ఓ జిల్లా కార్యదర్శి



చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాబోవు శాసనసభ ఎన్నికలల్లోనూ మరోమారు విజయం సాధించే దిశగా డీఎంకేలో భారీగా మార్పులు జరుగనున్నాయి. పార్టీలోని వివిధ విభాగాలకు నూతన జవసత్వాలు కల్పించేందుకు పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ సహా సీనియర్ నేతలు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం డీఎంకే సంస్థాగత పరంగా 72 జిల్లాల కార్యదర్శులున్నారు. వీరిలో సీనియర్ మంత్రులు, సీనియర్ జిల్లా కార్యదర్శులున్న జిల్లాల్లో ఐదు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. తక్కిన పార్టీ జిల్లాల్లో రెండు మూడు నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం పార్టీని మరింత విస్తృతపరిచేందుకు చెన్నైలో మూడు శాసనసభ నియోజకవర్గాలకు ఓ జిల్లా కార్యదర్శి చొప్పున నియమించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఇతర జిల్లాల్లో రెండు శాసనసభ నియోజకవర్గాలకు ఓ జిల్లా కార్యదర్శి చొప్పున నియమించనుంది. ఆ మేరకు పార్టీలో 117 జిల్లా కార్యదర్శులను నియమించేందుకు అధిష్ఠానం వ్యూహరచన చేస్తోంది. ప్రస్తుతం యువజన సంక్షేమం, క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి కొత్తగా జిల్లా కార్యదర్శులను నియమించే విషయమై అన్ని జిల్లాల నాయకులతో సంప్రదించినట్లు తెలుస్తోంది. ఆ ప్రకారం రూపొందించిన నివేదికను పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఆయన త్వరలో అందించనున్నారు. ఆ ప్రకారం ప్రస్తుతం మంత్రి పీకే శేఖర్ బాబు ఇన్‌ఛార్జిగా ఉన్న చెన్నై ఈస్ట్ జిల్లాను రెండు శాఖలుగా విభజించనున్నారు. మంత్రి సుబ్రమణ్యం ఇన్‌ఛార్జిగా ఉన్న చెన్నై సౌత్ జిల్లా, మంత్రి దామో అన్బరసన్ ఇన్‌ఛార్జిగా ఉన్న కాంచీపురం నార్త్ జిల్లాను విభజించి కొత్తగా మరికొన్ని జిల్లా శాఖలు ఏర్పాటు చేయనున్నారు. తెన్‌కాశి, విరుదునగర్, కన్నియాకుమారి, శివగంగ, రామనాథపురం జిల్లాలు సహా పలు జిల్లాల్లోనూ జిల్లా శాఖలను విభజించి కొత్తశాఖలు ఏర్పాటు చేసి జిల్లా శాఖ కార్యదర్శుల సంఖ్యను పెంచనున్నారు. ఒలింపిక్స్ క్రీడలకు వెళ్ళిన మంత్రి ఉదయనిధి బుధవారం నగరానికి తిరిగిరానున్నారు. ఆ తర్వాత ఒకటి రెండు రోజుల్లో డీఎంకే సమన్వయకమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరుగనుంది. ఆ సమావేశంలో పార్టీలో కొత్త జిల్లా శాఖలను ఏర్పాటు చేసే విషయమై సమగ్రంగా చర్చించనున్నారు. ఈనెల 16న జరుగనున్న డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశంలో 2026 శాసనసభ ఎన్నికల వ్యూహరచనలపై కూడా సమీక్ష జరుపనున్నారని తెలుస్తోంది.

స్టాలిన్ మూడేళ్ల పాలనపై సావనీర్


సావనీర్ ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి

ప్యారీస్, ఆగస్టు 14: రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం మూడేళ్లు పూర్తిచేసుకుని నాలుగో ఏట అడుగుపెట్టిన సందర్భంగా సాధించిన విజయాలకు ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ముద్రించిన ప్రత్యేక సావనీర్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. సచివాలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి ఎంపీ స్వామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ప్రింటింగ్ శాఖ కమిషనర్ శోభన, తమిళ అభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి వి.రాజారామన్, ఆ శాఖ డైరెక్టర్ ఆర్.వైద్యనాథన్ తదితరులు సభలో పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తమిళనాడు

అడయార్, ఆగస్టు 14: స్థానిక పట్టాభిరాంలోని ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహనా కార్యక్రమం జరిగింది. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించడం, సమాజంలో మాదకద్రవ్యాల రహిత వాతావరణాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో ఇటీవల జరిగింది. ముఖ్యమంత్రి స్టాలిన్ వర్చువల్‌గా 952 మంది విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కల్వీక్కరసి, సంచాలకుడు డాక్టర్ ఎన్.రాజేంద్రనాయుడు, ముఖ్య అతిథిగా హాజరైన ఐపీఎస్ అధికారి, ఆవడి పోలీసు కమిషనర్ శంకర్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రిన్సిపల్ కల్వీక్కరసి మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వ్యసనం పలు ఆరోగ్య సమస్యలకు దారి తీయడమే కాదు, జీవితాలను నశింపజేస్తాయన్నారు. మాదకద్రవ్య రహిత సమాజాన్ని రూపొందించడానికి కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. రాజేంద్రనాయుడు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల దుర్వినియోగం మన యువ సామర్థ్యాన్ని దెబ్బతీస్తూ భవిష్యత్‌కు ముప్పుగా మారిందన్నారు. విద్యావేత్తలు, విద్యార్థులుగా ఇతరులకు అవగాహన కల్పిస్తూ మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని సృష్టిస్తామని ప్రతిజ్ఞ చేద్దామని విద్యార్థులనుద్దేశించి సూచన చేశారు. ముఖ్య అతిథిగా శంకర్ మాట్లాడుతూ తాను పోలీస్ అధికారిగా అనేక వ్యక్తులు, కుటుంబాలు మాదకద్రవ్యాల వాడకం వల్ల నాశనం కావడం చూశానని ఆవేదన వ్యక్తం చేస్తూ.. సమాజానికి ఇది పెనుముప్పుగా మారిందన్నారు. యువతే దేశానికి భవిష్యత్తు నాయకులు కాబట్టి, మాదక ద్రవ్యాల రహిత సమాజంగా మార్పు కోసం పోరాడుతున్న వారికి మద్దతునిస్తూ, అవగాహణ కార్యక్రమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.


ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు

అరిహంత్ ఫౌండేషన్స్‌తో ఆషియానా హౌసింగ్ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆషియానా హౌసింగ్ లిమిటెడ్ నగరంలో అధునాతన సీనియర్ లివింగ్ ప్రాజెక్టు స్వరంగ్‌ను పరిచయం చేసేందుకు అరిహంత్ ఫౌండేషన్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. నగరంలో ప్రీమియం సీనియర్ హౌసింగ్ ఆప్షన్ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తూ ఆషియానా ఏర్పాటు చేస్తున్న మూడో ప్రాజెక్టు ఇది. ఇటీవల నగరంలో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో ఆషియానా సంస్థ ఎండీ అంకుర్‌గుప్తా, అరిహంత్ ఫౌండేషన్స్ డైరెక్టర్ భరత్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.